నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I హైదరాబాద్, శనివారం 14 డిసెంబర్ 2024 RANGAREDDY

రైతులకు రుణమాఫీ చేయడంలో
సర్కారు విఫలం

మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు వ్యవసాయ కార్యాలయంలో రుణమాఫీ వివరాలు తెలుసుకుంటున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు: రైతులకు రుణమాఫీ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మాటలకు చేతలకు పొంతన లేదని విమర్శించారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి లావణ్యను ఎంత మంది రైతులకు రుణమాఫీ అయిందని వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సబితా ఇంద్రారెడ్డి మీడియాతో మాట్లాడుతూ, రుణ మాఫీ 50 శాతం మందికి కూడా కాలేదని, చాలా మంది రైతులు బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ నేటికీ తిరుగుతున్నట్లు చెప్పారు. రుణమాఫీ చేయకుండా, రైతుబంధు ఇవ్వకుండా ప్రభుత్వం రైతు సంబురాలను నిర్వహించడం సిగ్గుచేటని విమర్శించారు. ఎంత మందికి రుణ మాఫీ అయిందనే నివేదికలు అధికారుల వద్దే లేవన్నారు. సంక్రాంతి తర్వాత రైతు బంధు వేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారని, ఆయన మాటలను ఎంత వరకు నమ్మాలని చెప్పారు. బీఆర్ఎస్ రైతులకు అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు సురుసాని రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుంట్లూరు పెద్ద చెరువు సర్వే పూర్తి

రెండ్రోజుల్లో హైడ్రాకు నివేదిక!

పెద్దఅంబర్‌పేట, డిసెంబర్ 13 : జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూరులోని పెద్ద చెరువు సర్వే పూర్తయింది. చెరువును కబ్జా చేస్తూ వేస్తున్న రోడ్డుపై స్థానికుల ఫిర్యాదుతో హైడ్రా అధికారులు స్పందించారు. చెరువును పరిశీలించారు. గ్రామ నక్ష ప్రకారం చెరువును సర్వే చేయాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇటీవల ఆదేశించారు. నక్ష ప్రకారం 95 ఎకరాలకు పైగా ఉన్న చెరువు హద్దులు గుర్తించాలని స్పష్టంచేశారు. ఇబ్రహీంపట్నం డివిజన్ సర్వే అధికారులు.. అబ్దుల్లాపూర్‌మెట్ ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులతో కలిసి పెద్ద చెరువు సర్వేను పూర్తి చేశారు. డిజిటల్ సర్వే ఆధారంగా పాయింట్లు గుర్తించినట్టు తెలిసింది. డిజిటల్ పాయింట్ల ఆధారంగా రెండ్రోజుల్లో నివేదికను రూపొందిస్తారని సమాచారం. సిద్ధం చేసిన నివేదికను నేరుగా హైడ్రాకు అందజేయనున్నట్లు సమాచారం.

వణికిస్తున్న చలి

ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే కిందకు పడిపోతుండడంతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో చలి తీవ్రత పెరుగుతున్నది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఉమ్మడి జిల్లాలో గరిష్ఠం 34.0, కనిష్ఠం 11.0 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

అమ్మా.. నా శవమే వస్తదేమో.. అంటున్నడు..

లగచర్ల ఘటనలో నా కొడుకు వినోద్‌ను అరెస్టు చేసిండ్రు. ఎప్పుడు ఫోన్ చేసినా అమ్మా.. నేను వస్తానో.. రానో.. నా శవమే వస్తదేమో.. జాగ్రత్త అమ్మా.. అని చెబుతుంటే కడుపు తరుక్కుపోతున్నది. కొడుకుని చూసుకుంటూ బతుకుతున్నా.. ఏమన్నా అయితే బతికున్నా.. సచ్చిన శవాలమే. నా కొడుకుతో పాటు మా మరిది, బావనూ అరెస్టు చేసిండ్రు. ఎట్ల ఉన్నరో తెల్వదు.. ఏం తింటున్నరో తెల్వదు.. కన్నతల్లి కడుపుకోత మాలాంటోళ్లకే తెలుసు.. సీఎం అయి గద్దెమీద కూర్చున్న రేవంత్‌కు ఏం తెలుసు.

– సుశీలాబాయి, రోటిబండతండా, దుద్యాల మండలం

రోడ్డుపై ధర్నా చేస్తున్న లగచర్ల బాధిత రైతు కుటుంబాల సభ్యులు

మా వాళ్లకు ఏమైనా అయితే మాకు దిక్కెవరూ..!

కండ్లు కాయలు కాసేలా నెల రోజులుగా ఎదురుచూస్తున్నం.. తిండి, నిద్ర లేదు.. పిల్లలు ఏడుస్తున్నరు.. అరెస్టు అయిన వారిలో చాలా మందికి ఆరోగ్యం బాగాలేదు.. గుండెనొప్పి ఉన్న వ్యక్తికి బేడీలు వేసి దవాఖానకు తీసుకెళ్తరా..? ఇంత జరుగుతున్నా సీఎం రేవంత్‌కు మనసు కరుగడం లేదని బాధితుల ఆవేదన

నేరస్తులు కాదు.. అన్నదాతలు

తమ వారిని విడుదల చేయాలని లగచర్ల గేటు వద్ద బాధిత రైతు కుటుంబ సభ్యుల ధర్నా..

'భూములు ఇవ్వబోమన్నందుకు కాంగ్రెస్ సర్కార్ గోస పెడుతున్నది.. మా కన్నీటి బాధ తీరేదెప్పుడు.. మా వాళ్లకు ఏమైనా అయితే మాకు దిక్కెవరూ..! అందుకు బాధ్యత ఎవరు తీసుకుంటరు.. మా బతుకులు ఏం కావాలె.. మమ్మల్ని సాకేదెవరు.. అరెస్టు అయిన నాటి నుంచి నెల రోజులుగా కండ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నం.. తిండి తినబుద్ధి అయితలేదు.. కంటికి నిద్ర లేదు.. పిల్లలు ఏడుస్తున్నరు.. మా నాన్న ఎక్కడని అడిగితే కడుపు తరుక్కుపోతున్నది.. అరెస్టైన వారిలో చాలా మంది జబ్బులున్నోళ్లే.. గుండె నొప్పి వస్తే బేడీలు వేసి దవాఖానకు తీసుకెళ్తరా.. ఇదేనా ప్రజాపాలనా.. ఇంత జరుగుతున్నా సీఎం రేవంత్‌కు మనసు కరుగుతలేదు..' అని లగచర్ల ఫార్మా బాధిత కుటుంబాల సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

- కొడంగల్, డిసెంబర్ 13

భూములను కాపాడుకునేందుకు

న్యాయ పోరాటం చేసి అరెస్టు అయిన రైతు కుటుంబాలు నిత్యం ఆవేదనతో కుమిలిపోతున్నాయి. కాంగ్రెస్ సర్కార్ తీరుకు నిరసనగా శుక్రవారం దుద్యాల మండలం కోస్గి–తుంకి మెట్ల రోడ్డులోని లగచర్ల గేటు వద్ద బాధిత రైతు కుటుంబాల సభ్యులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా భూములను కాపాడుకునేందుకే న్యాయ పోరాటం చేశామని, రాష్ట్ర ప్రభుత్వం ఇంత కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సమంజసం కాదన్నారు. లగచర్ల ఘటన జరిగిన నాటి నుంచి గ్రామాల్లో మగవాళ్లు లేక బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నామన్నారు. నెల రోజులుగా మా వాళ్లు ఎప్పుడొస్తారా.. అని ఎదురుచూస్తున్నామన్నారు. అరెస్టు అయిన వారిలో చాలా మందికి ఆరోగ్యాలు బాగాలేవని, కొంత మందికి జైలుకు వెళ్లిన తరువాతే బీపీ, షుగర్, గుండె జబ్బులు వచ్చాయని.. ఎలా ఉన్నారో అర్థం కావడం లేదని కన్నీరు పెట్టారు. సీఎం సొంత నియోజకవర్గంలో ప్రజలు బాధలు పడుతున్నా.. రేవంత్‌రెడ్డికి మనసు కరుగడం లేదని, ప్రజలపై ఇంత ద్వేషమెందుకని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్.. సీఎం కావాలని ఓట్లు వేస్తే.. ఇప్పుడు బూట్లతో తన్నుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్... సీఎం అయితే బతుకులు మారుతయనుకున్నం.. కానీ రోడ్డుపాలవుతమని అనుకోలేదని వారు వాపోయారు. పులిచర్లకుంట తండాకు చెందిన హీర్యానాయక్.. అరెస్టుకు ముందు ఆరోగ్యంగా ఉన్నారని, ఇప్పుడు గుండెజబ్బు రావడం బాధగా ఉన్నదని, చేతికి బేడీలు వేసి రోడ్డుపై నడిపించుకుంటూ దవాఖానకు ఎలా తీసుకెళ్తారని ప్రశ్నించారు. కొడుకును చూద్దామని వెళ్లిన ఓ కన్నతల్లిని అనుమతించకపోవడం దుర్మార్గ పాలనకు నిదర్శనమన్నారు. అరెస్టు అయిన వారికి ఏం జరిగినా సీఎం రేవంత్‌దే బాధ్యత అని.. తదుపరి పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. గ్రామాల్లో మగవాళ్లు లేక పండించిన పంట, పొలాల్లోనే మగ్గుతున్నదని వాపోయారు. ఘటనకు ముందు మేమున్నామని భరోసా ఇచ్చిన వారు సైతం మళ్లీ కనిపించడం లేదని ఆవేదన వెలుబుచ్చారు.

ధర్నా విషయం తెలుసుకున్న పోలీసులు లగచర్ల గేటు వద్దకు చేరుకుని బాధిత రైతు కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మరో వారం రోజుల్లో పరిస్థితి చక్కబడుతుందని, అంత వరకు శాంతియుతంగా ఉండాని సర్దిచెప్పడంతో బాధితులు ధర్నాను విరమించారు.

నా కొడుకు పిచ్చోడై తిరుగుతుండు..

నా భర్త నీరటి హన్మంతు జైలుకు వెళ్లిన నాటి నుంచి నా కొడుకు పిచ్చోడై తిరుగుతుండు.. పరీక్షలు చేయించి మందులు వేస్తున్నా. నా కొడుకును దవాఖానకు తీసుకెళ్తే.. అక్కడా బాధ పెడుతుండ్రు. నా భర్తకు ఆరోగ్యం బాగాలేక పది నెలల క్రితం ఆపరేషన్ కూడా అయ్యింది. ఆయనకు కిడ్నీలో రాళ్లు ఉన్నయని డాక్టర్లు చెప్పిండ్రు. ఎట్లున్నడో.. ఎప్పుడొస్తడో తెల్వక రోజూ ఏడుస్తూ కాలం గడుపుతున్నం.

– వెంకటమ్మ, లగచర్ల, దుద్యాల మండలం

నా భర్తకు ఆపరేషన్ చేయించా..

నా భర్త గోపాల్‌కు ఎదలో గడ్డ ఉంటే ఏడాది కింద ఆపరేషన్ చేయించినా. అప్పటి నుంచి రెండు, మూడు నెలలకోసారి దవాఖానకు వెళ్లి చూపించుకునేది. ఇప్పుడు జైల్లో ఉన్నడు. వాళ్లు పట్టించుకుంటుండ్రో.. లేదో.. బెంగగా ఉన్నది. నా భర్తకు ఏమైనా అయితే కుటుంబమంతా దిక్కులేనోళ్లమవుతం. ఇప్పటికైనా సర్కార్ దయతలచి వదిలిపెట్టాలి.

– మంజుల, లగచర్ల, దుద్యాల మండలం

జైలుకు వెళ్లాకే బీపీ, షుగర్ వచ్చింది..

జైలుకు వెళ్లాకే మా ఆయనకు బీపీ, షుగర్ వచ్చింది. మందులు వాడుతున్నడో.. లేదో తెల్వదు.. అంతకు ముందు ఆరోగ్యంగా ఉన్నారు. కాంగ్రెస్ సర్కార్ గోస పెడుతున్నది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కోసే వాళ్లు లేరు.. ఇంటికి చేర్చేవాళ్లు లేరు.. మా బాధను ఏ దేవుడికి చెప్పుకోవాలె. రేవంత్‌రెడ్డిని గెలిపించి రోడ్డున పడ్డాం.

– సుమిత్రాబాయి, రోటిబండతండా, దుద్యాల మండలం

బాధిత రైతు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న బొంరాస్‌పేట ఎస్ఐ రవూఫ్

హాస్టళ్లలో పురుగుల బియ్యం

ప్రభుత్వ హాస్టళ్లపై లోపించిన అధికారుల పర్యవేక్షణ

వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలతో ప్రభుత్వ దిద్దుబాటు చర్యలు

పురుగుల బియ్యాన్ని వెనక్కి తెప్పిస్తున్న జిల్లా యంత్రాంగం

అధ్వానంగా మారిన ప్రభుత్వ హాస్టళ్లు

వికారాబాద్, డిసెంబర్ 13, (నమస్తే తెలంగాణ) : చేతులు కాలినాక ఆకులు పట్టుకున్న చందంగా కాంగ్రెస్ ప్రభుత్వ తీరు తయారైంది. ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో భయానక పరిస్థితుల తర్వాత దిద్దుబాటు చర్యలు చేపట్టింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గురుకులాల్లో సీటు కోసం క్యూ కట్టిన పరిస్థితులు ఉంటే.. కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనలో హాస్టళ్ల పరిస్థితి అధ్వానంగా మారింది. ప్రస్తుతం ప్రభుత్వ గురుకులాల్లోని విద్యార్థులకు పురుగుల అన్నమే దిక్కైంది. 200 గురుకుల పాఠశాలలను వెయ్యి గురుకులాలకు పెంచి కార్పొరేట్ స్కూళ్ల స్థాయిలో కేసీఆర్ ప్రభుత్వం తీర్చిదిద్దింది. కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో భయానక పరిస్థితులు నెలకొంటున్నాయి. మెస్ చార్జీలు పెంచకపోవడంతో నాసిరకం భోజనాన్ని వడ్డిస్తుండడంతో నాలుగు రోజుల క్రితం తాండూరు ఎస్టీ హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ వల్ల విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. కులకచర్ల మండలం బండెల్కిచర్లలోని ఎస్టీ గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో పది మంది అస్వస్థతకు గురయ్యారు. కులకచర్ల మోడల్ స్కూల్ విద్యార్థులు అధికారులకు తెలియకుండా బయటకు వచ్చి మరీ అక్కడ నెలకొన్న సమస్యలను వివరించడం విశేషం. పురుగుల అన్నం పెడుతున్నారని, కుళ్లిపోయిన కూరగాయలు, నెలకు ఒక్కరోజు కూడా గుడ్డు, పాలు ఇవ్వడం లేదని విద్యార్థులు మీడియాకు వెల్లడించారు.

పురుగులు పట్టిన బియ్యాన్ని వెనక్కి పంపిస్తున్న హాస్టల్ సిబ్బంది

పురుగుల బియ్యం వెనక్కి..

బీఆర్ఎస్ నేతలు హాస్టళ్ల పరిశీలనకు వెళ్తుండడంతో అక్కడున్న అధ్వాన పరిస్థితులు వెలుగులోకి రాకుండా ప్రభుత్వం అధికారులతో తనిఖీలు చేయిస్తున్నది. వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలకు కారణాలపై పరిశీలించిన అధికారులు పురుగులు పట్టిన బియ్యమే ప్రధాన కారణమని కలెక్టర్‌కు నివేదించినట్లు తెలిసింది. ఏడాది క్రితం సరఫరా చేసిన బియ్యాన్నే వండి పెడుతున్నట్లు తేలింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డైట్ చార్జీలే కాదు... బియ్యం కూడా సరఫరా చేయలేదనే విమర్శలు వెలువడుతున్నాయి. ఏడాది కాలంగా పురుగుల బియ్యమే వండి పెడుతున్నా అధికారులు పర్యవేక్షించకపోవడం గమనార్హం. తాండూరు ఎస్టీ గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో సుమారు 15 మంది విద్యార్థులు అస్వస్థతకు గురి కావడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలోని పురుగుల బియ్యాన్ని వెనక్కి తెప్పిస్తున్నారు. జిల్లాలోని 125 ప్రభుత్వ హాస్టళ్లకు ప్రతి నెలా 4500 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేస్తున్నట్లు జిల్లా యంత్రాంగం తెలుపుతుండడం గమనార్హం.

మాతా శిశు దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

జిల్లా దవాఖానకు
విద్యార్థినులు

మూడు రోజులూ హాస్టల్‌లోనే వైద్యం

ప్రస్తుతం సర్కార్ దవాఖానకు తీసుకెళ్లడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన

విద్యార్థిని నీలావతిని నిమ్స్ దవాఖానకు తరలించడంపై ఆరా..

తాండూరు, డిసెంబర్ 13 : తాండూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఆహారం వికటించి అస్వస్థతకు గురైన పది మంది విద్యార్థినుల్లో 9 మందిని తాండూరు జిల్లా దవాఖానకు, మరొక విద్యార్థిని నీలావతిని హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానకు శుక్రవారం తరలించారు. మూడు రోజుల పాటు హాస్టల్‌లోనే వైద్యం అందించిన డాక్టర్లు...జిల్లా దవాఖానకు తీసుకెళ్లడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన పెరిగింది. సర్కార్ దవాఖానలో విద్యార్థినులకు స్కానింగ్, రక్త పరీక్షలు చేసిన తర్వాత ఎలాంటి ప్రమాదం లేదని తెలుపడంతో తల్లిదండ్రులు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. వాంతులు, విరోచనాలు కావడం వల్ల ఎనర్జీ లాస్ అయినట్లు తెలిపారు. మరో వైపు హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానకు విద్యార్థిని నీలావతిని ఎందుకు తరలించారని తల్లిదండ్రులు అడుగగా డాక్టర్లు సమాధానం చెప్పకపోవడంతో తోటి విద్యార్థినులు అందోళన చెందుతున్నారు.

తల్లిదండ్రుల ఒత్తిడితోనే దవాఖానకు..

ఉడికీఉడకని ఆహారం తిని అస్వస్థతకు గురైన విద్యార్థినులకు మూడు రోజులుగా పాఠశాలలోనే వైద్యం అందించారు. దవాఖానకు తీసుకెళ్లాలని తల్లిదండ్రులు, బంధువులు ఒత్తిడి చేయడం, బీఆర్ఎస్ మద్దతుతో ఆందోళన చేపట్టడంతో దవాఖానకు తరలించారు. కాంగ్రెస్ నేతల కనుసన్నల్లో అధికారులు పని చేస్తున్నారని, విద్యార్థినులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని బీఆర్ఎస్ నేతలు హెచ్చరించారు. విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని, లేనిచో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

గిరిజన ఆశ్రమ పాఠశాల గేటు ఎదుట తమ పిల్లల కోసం దిగులు చెందుతున్న తల్లిదండ్రులు , లోనికి అనుమతించని పోలీసులు